సమాచారం

నేడు బీఆర్‌ఎస్‌ పార్టీ విస్తృత స్థాయి సమావేశం

బండ్లగూడ: గండిపేట మండల బీఆర్‌ఎస్‌ పార్టీ విస్తృత స్థాయి సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు బండ్లగూడ జాగీరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు గోకరి సురేష్‌గౌడ్‌ తెలిపారు. బండ్లగూడలోని జీఆర్‌కే ఫంక్షన్‌హాల్‌లో శనివారం ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో బండ్లగూడ జాగీరు మున్సిపల్‌ కార్పొరేషన్‌, నార్సింగి, మణికొండ మున్సిపల్‌ బీఆర్‌ఎస్‌ పార్టీ నాయకులు పాల్గొంటారన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా చేవెళ్ల ఎంపీ డాక్టర్‌ రంజిత్‌రెడ్డి, రాజేంద్రనగర్‌ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌లతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు హాజరవుతారన్నారు.

నేడు ఇందిరా పార్క్‌ వద్ద నిరుద్యోగ మహాధర్నా

రాజేంద్రనగర్: బీజేపీ తలపెట్టిన నిరుద్యోగ మహాధర్నాలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని రంగారెడ్డి అర్బన్‌ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి సులిగే వెంకటేష్‌ కురుమ అన్నారు. తెలంగాణ బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్‌ నేతృత్వంలో ఈ నెల 25వ తేదీన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిరుద్యోగ మహాధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఇందిరా పార్కు ధర్నా చౌక్‌లో నిర్వహించనున్నట్లు ఈ ధర్నాలో రంగారెడ్డి అర్బన్‌ జిల్లాలోని నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

3 నుంచి పలు కోర్సులపై శిక్షణ

శంషాబాద్: శంషాబాద్‌ అంతర్జాతీయ విమానాశ్రయంలోని జీఎంఆర్‌ వరలక్ష్మీ ఫౌండేషన్‌లో నిర్వహిస్తున్న నైపుణ్య శిక్షణా కేంద్రంలో నిరుద్యోగ యువతకు స్వల్పకాలిక నైపుణ్య శిక్షణ కోర్సులను ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఏసీ టెక్నీషియన్‌, హోటల్‌ మేనేజ్‌మెంట్‌, ఆటోమొబైల్‌ రిపేరింగ్‌, ఎక్సావేటర్‌ ఆపరేటింగ్‌, డ్రైవాల్స్‌, ఫాల్స్‌ సీలింగ్‌, వెల్డింగ్‌ టెక్నీషియన్‌, డేటా ఆపరేటర్‌, టైలరింగ్‌ (మహిళలకు మాత్రమే) కోర్సులను ఏప్రిల్‌ 3 నుంచి ప్రారంభించనున్నామని, ఔత్సాహిక అభ్యర్థులు సెల్: 8985800102, 9494800102 నంబర్లలో సంప్రదించాలన్నారు.

తెలంగాణ పోలీస్‌ అకాడమీ అసిస్టెంట్‌ డైరెక్టర్‌గా శ్రీనివాస్‌రావు



పోలీస్‌ అకాడమీ డైరెక్టర్‌ సందీప్‌ శాండిల్యకు బొకే అందజేస్తున్న వి.శ్రీనివాస్‌రావు

బండ్లగూడ: రాజబహదూర్‌ వెంకట్రామారెడ్డి తెలంగాణ రాష్ట్ర పోలీస్‌ అకాడమీ అసిస్టెంట్‌ డైరెక్టర్‌గా వి.శ్రీనివాస్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం పోలీస్‌ అకాడమీ డైరెక్టర్‌ సందీప్‌ శాండిల్యను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం అడిషనల్‌ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1996 ఆర్మ్‌డ్‌ ఎస్సైగా వరంగల్‌ రేంజ్‌లో సర్వీసులో చేరినట్లు తెలిపారు. అనంతరం ఆదిలాబాద్‌, కరీంనగర్‌ జిల్లాల్లో రిజర్వ్‌ ఎస్సైగా పని చేశానన్నారు. బాధ్యతలు చేపట్టిన ఆరుగురు తీవ్రవాదులను మట్టుబెట్టామన్నారు. ఆదిలాబాద్‌లో 1998లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అప్పటి డీజీపీ చేతుల మీదుగా నగదు రివార్డులు తీసుకోవడం జరిగింది. 2006లో ఆర్‌ఐగా ప్రమోషన్‌ పొంది కరీంనగర్‌, ఖమ్మంలో పని చేశారు. 2017లో డీఎస్పీ ఏఆర్‌గా ప్రమోషన్‌ పొంది రాచకొండలో పని చేశారు. వీఐపీల భద్రత అధికారిగా ఉండి కమిషనర్‌ మన్ననలు పొందారు. 2021లో తెలంగాణ పోలీస్‌ అకాడమీలో ఔట్‌డోర్‌ డీఎస్పీగా చేశారు. ప్రభుత్వం 1996 బ్యాచ్‌ ఆర్మ్‌డ్‌ డీఎస్పీలకు 11 మందికి అడిషనల్‌ ఎస్పీలుగా ప్రమోషన్‌ ఇచ్చారు. వీటిలో వి.శ్రీనివాస్‌రావుకు కూడా ప్రమోషన్‌ ఇస్తూ తెలంగాణ పోలీస్‌ అకాడమీలో అసిస్టెంట్‌ డైరెక్టర్‌గా పోస్టింగ్‌ ఇచ్చారు. ఈ సందర్భంగా అకాడమీ అధికారులు ఆయనను అభినందించారు.

క్లుప్తంగా...

గ్రామాభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌

శంషాబాద్‌ రూరల్: గ్రామాభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్ర ఎంతో కీలకమని రాజేంద్రనగర్‌ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌ అన్నారు. మండల పరిషత్‌ కార్యాలయం సమావేశం హాలులో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో దీన్‌దయాళ్‌ ఉపాధ్యాయ పంచాయత్‌ సతత్‌ వికాస్‌ పురస్కారాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. 9 విభాగాల్లో ఉత్తమ పంచాయతీలుగా ఎన్నికైన సర్పంచులకు వీటిని అందజేసి సన్మానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జయమ్మ, జడ్పీటీసీ తన్వీ, ఎంపీడీఓ వసంత లక్ష్మీ, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రపంచ స్థాయి పోలీసింగ్‌

- రాష్ట్ర హోం మంత్రి మహమూద్‌ అలీ
- అట్టహాసంగా నార్సింగి ఠాణా భవన ప్రారంభం
- వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌, ఎంపీ రంజిత్‌రెడ్డి, సైబరాబాద్‌ సీపీ స్టీఫెన్‌ రవీంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న హోంమంత్రి మహమూద్‌ అలీ

మణికొండ: ప్రపంచ స్థాయిలో పోలీసింగ్‌ వ్యవస్థ ఒకప్పుడు జపాన్‌ దేశంలో బాగుంటుందనే పేరు ఉండేదని, ప్రస్తుతం అగ్రస్థానంలో మన తెలంగాణ రాష్ట్రం నిలుస్తోందని రాష్ట్ర హోంమంత్రి మహమూద్‌ అలీ అన్నారు. శుక్రవారం సైబరాబాద్‌ పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలోని నార్సింగి పోలీస్‌స్టేషన్‌ నూతన భవనాన్ని ఎంపీ డాక్టర్‌ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌, సైబరాబాద్‌ కమిషనర్‌ స్టీఫెన్‌ రవీంద్రలతో కలిసి హోంమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన రాష్ట్రంలో శాంతి భద్రతలు సక్రమంగా ఉండటంతోనే ప్రపంచ స్థాయి సంస్థలు వచ్చి పెట్టుబడులు పెడుతున్నాయన్నారు. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి పోలీసు వ్యవస్థ పటిష్టానికి సీఎం కేసీఆర్‌ పూర్తి స్థాయిలో బడ్జెట్‌ కేటాయించటంతో పాటు పటిష్ట చర్యలు చేపడుతున్నారన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా రూ.585 కోట్ల ఖర్చుతో కమాండ్‌ కంట్రోల్‌ భవనాన్ని నిర్మించి అత్యాధునిక సౌకర్యాలను కల్పించారన్నారు. రాష్ట్రం రాక ముందు ఒక్క హైదరాబాద్‌ పోలీస్‌ కమిషనరేట్‌ మాత్రమే ఉండగా ప్రస్తుతం కొత్తగా 9 పోలీస్‌ కమిషనరేట్లను ఏర్పాటు చేశామన్నారు. దేశంలోనే అత్యధికంగా 60 శాతం సీసీ కెమెరాలు మన రాష్ట్రంలో ఉండటంతో నేరాలు చేసేందుకు భయపడుతున్నారన్నారు. అయినా నేరాలు చేసిన వారిని గంటల వ్యవధిలోనే అరెస్టు చేస్తున్నారన్నారు. షీటీమ్‌ల ఏర్పాటుకు మహిళకు భద్రత పెరిగిందని, అర్ధరాత్రి సైతం స్త్రీలు తిరగ గలుగుతున్నారన్నారు. ప్రజలతో మమేకమై ఫ్రెండ్లీ పోలీసింగ్‌ చేయడంతో వారికి పోలీసులంటే భయం పోయిందన్నారు. భవిష్యత్తులో సైబర్‌ నేరాలు మరింతగా పెరుగుతాయని, అందుకు అనుగుణంగా సాంకేతికంగా పోలీస్‌స్టేషన్లను అధునాతనంగా నిర్మిస్తున్నామని తెలిపారు.



ఎమ్మెల్యేతో కలిసి పోలీస్‌స్టేషన్‌ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మహమూద్‌ అలీ



నార్సింగి ఏసీపీ రమణగౌడ్‌ను సీటులో కూర్చోబెట్టి అభినందిస్తున్న మంత్రి

ఐదేళ్ల నిరీక్షణకు మోక్షం...

గత ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న నార్సింగి నూతన పోలీస్‌స్టేషన్‌ భవనం ఎట్టకేలకు శుక్రవారం ప్రారంభమైంది. ప్రారంభోత్సవానికి విచ్చేసిన డిప్యూటీ సీఎంకు పోలీస్‌స్టేషన్‌ ఆవరణలో పోలీసులు గౌరవ వందనం చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌ రిజిస్టర్లను తనిఖీ చేసి నార్సింగి ఏసీపీ రమణగౌడ్‌, సీఐ శివకుమార్‌లను వారి గదుల్లో సీట్లలో కూర్చోబెట్టి వారిని అభినందించారు. కార్యక్రమంలో పోలీస్‌హౌసింగ్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ దామోదర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా పరిషత్‌ చైర్‌పర్సన్‌ తీగల అనితాహరినాథ్‌రెడ్డి, పోలీస్‌ అకాడమీ డైరెక్టర్‌ సందీప్‌ శాండిల్య, రాజేంద్రనగర్‌ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, శంషాబాద్‌ డీసీపీ నారాయణరెడ్డి, ఎస్‌ఓటీ డీసీపీ శ్రీనివాస్‌రెడ్డి, అడిషనల్‌ డీసీపీ నారాయణ, నార్సింగి ఏసీపీ రమణగౌడ్‌, ఇన్‌స్పెక్టర్‌ శివకుమార్‌, నార్సింగి మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ డి.రేఖయాదగిరి, వైస్‌ చైర్మన్‌ జి.వెంకటేశ్‌యాదవ్‌, బండ్లగూడ మున్సిపల్‌ కార్పొరేషన్‌ మేయర్‌ మహేందర్‌గౌడ్‌, నార్సింగి మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ డి.వెంకటేశ్‌గౌడ్‌, మణికొండ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్‌ ఫ్లోర్‌ లీడర్‌ కె.రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.



ఎంపీ రంజిత్‌రెడ్డికి మెమొంటోను అందిస్తున్న సైబరాబాద్‌ సీపీ స్టీఫెన్‌ రవీంద్ర



పోలీస్‌స్టేషన్‌ ముందు ఏసీపీ, సీఐ, ఎస్సైలు, సిబ్బంది



పోలీస్‌స్టేషన్‌ రిజిస్టర్‌లో సంతకం పెడుతున్న హోంమంత్రి

పోరాట స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి



భగత్‌సింగ్‌, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న ఏఐఎస్‌ఎఫ్‌ నాయకులు

రాజేంద్రనగర్: భగత్‌సింగ్‌, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల పోరాట స్ఫూర్తితో నేటి విద్యార్థి, యువత తమ హక్కుల కోసం ఉద్యమించాలని ఏఐఎస్‌ఎఫ్‌ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్‌ అన్నారు. ఏఐఎస్‌ఎఫ్‌ రంగారెడ్డి జిల్లా కౌన్సిల్‌ సమావేశాన్ని రాజేంద్రనగర్‌ ఏఆర్‌ దేవరాజ్‌ భవన్‌లో పి.శివ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. భవిష్యత్తు కార్యాచరణ, పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఏఐఎస్‌ఎఫ్‌ రంగారెడ్డి జిల్లా సమితి ఆధ్వర్యంలో భగత్‌సింగ్‌, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 92వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు పానుగంటి పర్వతాలు, జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు శివ, క్రాంతి, శ్రీకాంత్‌, శ్యామ్‌ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

రాజేంద్రనగర్: ప్రజలు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా, దృఢంగా ఉంటారని బీజేపీ నాయకుడు వై.శ్రీధర్‌ తెలిపారు. ఇంటర్నేషనల్‌ ఇయర్‌ ఆఫ్‌ మిల్లెట్స్‌–2023లో భాగంగా శుక్రవారం గగన్‌పహాడ్‌లోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మిల్లెట్స్‌ టిఫిన్‌ను అందజేశారు. 365 రోజులు పాటు 365 ప్రాంతాల్లో 365 మంది ప్రజలకు ఉచితంగా ఈ మిల్లెట్స్‌ను అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గగన్‌పహాడ్‌లో మిల్లెట్స్‌ను అందజేస్తున్న నాయకులు

ఫైర్‌సేఫ్టీపై అవగాహన



అగ్ని ప్రమాదాలపై డెమో ఇస్తున్న సిబ్బంది

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ కళాశాలలో శుక్రవారం అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకునే జాగ్రత్తలపై ఫైర్‌ సర్వీసెస్‌ అధికారులు, సిబ్బంది అవగాహన కల్పించారు. వందల మంది ఉండే కళాశాలలో తప్పనిసరి అగ్ని నిరోధక చర్యలు చేపట్టాలని అగ్నిమాపక శాఖ అధికారి జగన్మోహన్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ జి.చంద్రమోహన్‌రెడ్డి, అడ్మిన్‌ అధికారి వీవీ రమణారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్‌ అధికారి డాక్టర్‌ జి.బాల్‌రెడ్డి, అధ్యాపకులు రవిచందర్‌, శివారెడ్డిలతో పాటు విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు అకాడమీలో ఒగ్గు కళా ప్రదర్శన



ఒగ్గు కళాకారులతో అధికారులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలోని తెలంగాణ పోలీస్‌ అకాడమీలో ఒగ్గుకథ కళా ప్రదర్శన ఏర్పాటు చేశారు. అకాడమీలో శిక్షణ పొందుతున్న అసిస్టెంట్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్స్‌కు తెలంగాణ సంస్కృతిని పరిచయం చేసే కార్యక్రమంలో భాగంగా జానపదంలో ఎంతో ప్రఖ్యాతిగాంచిన వారితో ఒగ్గు డోలు కథా గానంను సాయంత్రం అకాడమీలోని రాణి రుద్రమదేవి సమావేశ మందిరంలో ఏర్పాటు చేశారు. ప్రముఖ ఒగ్గు జానపద కళాకారుడు డాక్టర్‌ రవికుమార్‌ తన బృందంతో ఒగ్గు డోలు కథను ఆలపించి ఎన్నో విన్యాసాలు ప్రదర్శించి పోలీసు శిక్షణార్థులకు ఎంతో ఉత్తేజం కలిగించారు. ఒగ్గు డోలు కథ, శివుడు, ఆయన ఢమరుకం గురించి వివరించారు. అంతరించిపోతున్న ఈ కళ కోసం పరితపించి ఒగ్గు కళా సామ్రాట్‌ డాక్టర్‌ చుక్కా సత్తయ్య ఆధ్వర్యంలో జానపద కళ జీవిస్తోందని కొనియాడారు. పోలీస్‌ అకాడమీలో మూడోసారి అవకాశం ఇచ్చి ప్రోత్సహించారని డైరెక్టర్‌ సందీప్‌ శాండిల్యకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్‌ సందీప్‌ శాండిల్య, జాయింట్‌ డైరెక్టర్‌ నవీనకుమార్‌, డిప్యూటీ డైరెక్టర్‌ రాదేశ్‌మురళీ, లా ఫ్యాకల్టీ రాజేశ్వరరావు, డానియెల్‌, అసిస్టెంట్‌ డైరెక్టర్లు గంగారెడ్డి, రమణ, భూపాల్‌, సతీష్‌, ఆధూరి శ్రీనివాసరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

‘టీఎస్‌పీఎస్‌సీని రద్దు చేసే వరకు ఉద్యమిస్తాం’



ధర్నాలో మాట్లాడుతున్న అంజన్‌కుమార్‌గౌడ్‌

శంషాబాద్: టీఎస్‌పీఎస్‌సీని రద్దు చేసే వరకు ఉద్యమాన్ని ఆపేదే లేదని బీజేపీ సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర నాయకుడు అంజన్‌కుమార్‌గౌడ్‌ అన్నారు. న్యాయం కోసం ఉద్యమించిన వారిని జైల్లో పెడతారా అని ఆయన ప్రశ్నించారు. బీజేవైఎం ఆధ్వర్యంలో టీఎస్‌పీఎస్‌సీ రద్దు చేయాలంటూ పట్టణంలోని ఫ్లైఓవర్‌ రోడ్డు వద్ద ధర్నా చేపట్టారు. నిరుద్యోగుల కోసం పోరాడుతున్న బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాష్‌ అరెస్ట్‌ అప్రజాస్వామికమని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్‌ అన్నారు. నిరుద్యోగులకు ఒక్కొక్కరికీ ప్రభుత్వం రూ.లక్ష నష్ట పరిహారం చెల్లించాలని, లీకేజీకి బాధ్యత వహిస్తూ టీఎస్‌పీఎస్‌ పాలకమండలితో పాటు మంత్రులు తమ పదవులకు రాజీనామాలు చేయాలని డిమాండ్‌ చేశారు. వెంటనే సిట్టింగ్‌ జడ్జితో విచారణ చేపట్టాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో చింతల నందకిశోర్‌ గుప్తా, సుదర్శన్‌రెడ్డి, వై.శ్రీధర్‌, మల్లేష్‌, మహాలింగం, విజయ్‌కుమార్‌, బిక్షపతి, మహేష్‌ యాదవ్‌, కిరణ్‌, రవికాంత్‌రెడ్డి, వంశీయాదవ్‌, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్‌ శిబిరం



గ్రామస్తులను సన్మానిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్‌ ఆఫీసర్‌

శంషాబాద్‌ రూరల్: మండలంలోని మల్కారం గ్రామంలో ఏవీ కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్‌ఎస్‌ఎస్‌ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా చివరి రోజు వ్యాధి పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ మాధవియాదగిరిరెడ్డి, ఉపసర్పంచ్‌ లలిత జంగయ్య, ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం ఆఫీసర్‌ యాదయ్య, ఎస్‌ఐలు రాజ్‌కుమార్‌, బలరాం, ఎస్‌ఎంసీ చైర్మన్‌ శ్రీరాములు, వార్డుసభ్యులు పాల్గొన్నారు.



ఇటీవల సినిమా రంగంలోనే ప్రపంచ ప్రఖ్యాత ఆస్కార్‌ అవార్డును అందుకున్న సినీ గేయ రచయిత చంద్రబోస్‌ను ఆయన నివాసంలో శుక్రవారం కలిసి అభినందిస్తున్న సినీనటుడు, మనం సైతం స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు కాదంబరి కిరణ్‌. - మణికొండ

కంటి వెలుగును ప్రజలు ఉపయోగించుకోవాలి



శిబిరాన్ని పరిశీలిస్తున్న మేయర్‌ మహేందర్‌గౌడ్‌

బండ్లగూడ: కంటి సమస్యలతో బాధ పడుతున్న పేదల కళ్లల్లో వెలుగులు నింపాలని రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, కంటి వెలుగును ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ మేయర్‌ మహేందర్‌గౌడ్‌ అన్నారు. కార్పొరేషన్‌ 13వ డివిజన్‌లోని వెస్టెండ్‌ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో కంటి వెలుగు కేంద్రాన్ని కార్పొరేటర్‌ మాలతీనాగరాజుతో కలిసి ప్రారంభించారు. ఈ నెల 31వ తేదీ వరకు ఈ శిబిరం కొనసాగుతోందని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్‌ నాయకులు నాగరాజు, కట్ట సాయిబాబా, కాలనీ వాసులు, వైద్య సిబ్బంది అమృత తదితరులు పాల్గొన్నారు.

రాజస్థానీల గన్‌గౌర్‌–2023 వేడుక

రాజేంద్రనగర్: రాజస్థాన్‌కు చెందిన కుటుంబాలు నగరంలో స్థిరపడి ప్రతి సంవత్సరం గన్‌గౌర్‌ పేరిట ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం రాత్రి రాంబాగ్‌లోని శ్రీరామచంద్ర స్వామి ఆలయం ఆవరణలో గన్‌గౌర్‌–2023 పేరిట ఉత్సవాలు నిర్వహించారు. రాజస్థాన్‌ మహిళా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్‌ సర్కిల్‌ పరిధిలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ రాజస్థాన్‌ మహిళలు తమ పిల్లాపాపలతో పాల్గొన్నారు. రాజస్థాన్‌ సంప్రదాయ దుస్తుల్లో ఈ కార్యక్రమానికి హాజరై తెలంగాణ రాజస్థాన్‌ ప్రజలు నిర్వహించుకునే పండుగలను వివిధ నాటకాల రూపంలో ప్రదర్శించి ఆకట్టుకున్నాయి. అర్ధరాత్రి వరకు కొనసాగిన ఈ వేడుకకు అత్తాపూర్‌ ఔట్‌పోస్టు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తున్న విద్యార్థులు



కార్యక్రమంలో రాజస్థాన్‌ మహిళా మండలి సభ్యులు

ప్రమాదకర స్పీడ్‌ బ్రేకర్ల తొలగింపు చర్యలు

సాక్షి ఎఫెక్ట్‌..

శంషాబాద్: ఓ విద్యార్థి దుర్మరణంతో పాటు మరో పదిమందికి పైగా గాయాలపాలు కావడానికి కారణమైన స్పీడ్‌ బ్రేకర్లను హెచ్‌ఎండీఏ తొలగించే పని చేపట్టింది. ఔటర్‌ సర్వీసు రహదారిలో ఇటీవల కొత్తగా తారు వేయడంతో పాటు రద్దీ ప్రాంతాల్లో భారీ స్పీడ్‌ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. వాటిపై కనీసం రేడియం స్టికర్లు కూడా పెట్టకపోవడంతో వేగంగా ప్రయాణిస్తున్న వాహనదారులు ప్రమాదాల బారిన పడ్డారు. కేవలం రెండు రోజుల వ్యవధిలోనే ఓ విద్యార్థి దుర్మరణంతో పాటు పదిమందికిపైగా గాయాలపాలయ్యారు. ప్రమాదాలకు కారణంగా మారిన స్పీడ్‌ బ్రేకర్లపై గురువారం సాక్షిలో ప్రచురితమైన ‘యమ డేంజర్‌.. స్పీడ్‌ బ్రేకర్‌’ అనే కథనం కూడా ప్రచురితమైంది. ప్రమాదాలకు స్పీడ్‌ బ్రేకర్ల కారణమని నిర్ధారణ కావడంతో అనాలోచితంగా వేసిన వాటిని తొలగించేస్తున్నారు.



స్పీడ్‌ బ్రేకర్లను తీసివేసిన దృశ్యం

చిరుధాన్యాల్లో పోషకాలు పుష్కలం

శంషాబాద్‌ రూరల్: చిరుధాన్యాల్లో పోషకాలు పుష్కలంగా ఉంటాయని ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ సంధ్యారాణి అన్నారు. పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని పాల్మాకుల పాఠశాలలో 8, 9 తరగతి విద్యార్థులకు చిరుధాన్యాల విశిష్టతను తెలిపారు. అదేవిధంగా చిరుధాన్యాల అంశంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్‌, ఉపాధ్యాయులు నిర్మల, యశోద, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రేమలత, మంజుల, కవిత, అరుణ, సుమలత, తదితరులు పాల్గొన్నారు.



చిరుధాన్యాల విశిష్టతను తెలుపుతున్న సూపర్‌వైజర్‌ సంధ్యారాణి

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత



జెండా ఊపి ఎలక్ట్రిక్‌ చెత్త ఆటోలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌

రాజేంద్రనగర్: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని రాజేంద్రనగర్‌ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌ అన్నారు. రాజేంద్రనగర్‌ మున్సిపాలిటీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌కు కేటాయించిన ఎలక్ట్రిక్‌ చెత్త ఆటోలను శుక్రవారం సర్కిల్‌ డిప్యూటీ కమిషనర్‌ జగన్‌తో కలిసి జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు చెత్తాచెదారాలు, వ్యర్థాలను రోడ్లకు ఇరువైపుల, ఖాళీ ప్రదేశాల్లో వేయొద్దని, తమ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకున్నప్పుడే ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

అగ్రశ్రేణి వర్సిటీగా హెచ్‌సీయూ

రాయదుర్గం: ప్రపంచ వ్యాప్త యూనివర్శిటీ ర్యాంకింగ్స్‌ ప్రకారం హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్శిటీ ప్రపంచంలోని అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. గ్లోబల్‌ హయ్యర్‌ ఎడ్యుకేషన్‌ అనలిస్ట్‌ క్యూఎస్‌ క్యాక్వెరెల్లి సైమండ్స్‌ విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో హెచ్‌సీయూ సోషియాలజీ, ఇంగ్లీష్‌ ల్యాంగ్వేజ్‌, లిటరేచర్‌లో అత్యుత్తమ పనితీరును కనబరిచింది. భారతదేశంలోని వర్సిటీలలో హెచ్‌సీయూ 5వ స్థానంలో ఉంది.

క్రైం కార్నర్‌..

డబ్బుల కోసం బెదిరించిన వార్డు సభ్యులపై కేసు

శంషాబాద్‌ రూరల్: ప్లాటులో పనులు చేస్తుండగా అడ్డుకోవడంతో పాటు డబ్బుల కోసం బెదిరించిన పంచాయతీ వార్డు సభ్యులపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని చౌదరిగూడ సర్వే నంబరు.207లోని 14 నంబరు ప్లాటుకు స్థానికులు తాళ్ల శ్రీనివాస్‌ సంరక్షుడిగా ఉన్నాడు. ఈ నెల 23న ప్లాటులో జేసీబీతో పనులు చేయిస్తుండగా వార్డు సభ్యులు ఎం.మహేష్‌, ఎం.మల్లేష్‌, మరో వార్డు సభ్యురాలు పరిపూర్ణ భర్త ఎం.మహేష్‌ అక్కడకు వచ్చి పనులను అడ్డుకున్నారు. తమ అనుమతి లేకుండా, డబ్బులు ఇవ్వకుండా పనులు ఎలా చేస్తావని దుర్భాషలాడుతూ బెదిరించారు. దీంతో బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తొమ్మిది మందికి జైలు శిక్ష

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌ ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని పట్టుబడ్డ 31 మంది ప్రతివాదుల్లో తొమ్మిది మందికి జైలు శిక్ష విధించారు. ట్రాఫిక్‌ నియమాలు ఉల్లంఘించి, మద్యం సేవించి వాహనం నడిపిన, డ్రైవింగ్‌ లైసెన్స్‌ లేకుండా వాహనం నడిపిన, డ్రైవింగ్‌ లైసెన్స్‌ రద్దు చేయబడిన తరువాత కూడా వాహనం నడిపిన వారిపై రాజేంద్రనగర్‌ ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ ఎస్‌హెచ్‌ఓ శ్యామ్‌సుందర్‌రెడ్డి 31 మందిపై చార్జ్‌షీట్‌ నమోదు చేశారు. వీరిని 3వ స్పెషల్‌ ఎంఎం కోర్టు మెజిస్ట్రేట్‌ నజీరుద్దీన్‌ ముందు హాజరుపర్చగా ఆయన 31 ప్రతివాదుల్లో తొమ్మిది మందికి జైలు శిక్ష విధించారు. ఒకరికి 5 రోజులు, ఆరుగురికి నాలుగు రోజులు, ఇద్దరికి మూడు రోజుల చొప్పున జైలు శిక్ష విధించారు. అదే విధంగా మిగిలిన ప్రతివాదులకు జరిమానా విధించారు. మొత్తం 31 మంది నుంచి రూ.1,16,700 జరిమానా వసూలు చేశారు.